# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in  ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం  తెలుగు దిన పత్రిక

సంపుటి : 02  సంచిక : 131  క్రిష్ణా, గురువారం 05 - 02 - 2026  పేజిలు : 4  వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఫోరం ఫర్ అర్.టీ.ఐ.క్యాలెండర్ ఆవిష్కరించిన అర్బన్ బ్యాంక్ చైర్మన్



**కృష్ణాజిల్లా మచిలీపట్నం:::: క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** ఫోరం ఫర్ అర్.టీ.ఐ.క్యాలెండర్ ఆవిష్కరించిన అర్బన్ బ్యాంక్ చైర్మన్ ది అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఇమడ బత్తుల దిలీప్ కుమార్ ఈరోజు అనగా మంగళవారం ఫోరం ఫర్ ఆర్టి.ఐ. క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టి.ఐ. కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు అదేవిధంగా హక్కుల కోసం పోరాట పదాల్లో పయనిస్తూ హక్కులను కాపాడుకుని భావితరాలకు అందించాలన్నారు అణగారీన వర్గాల కోసం పోరాడుతున్న ఫోరం ఫర్ ఆర్టీ.ఐ. సభ్యులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పేద ప్రజలకు చట్టాలపై హక్కులపై అవగాహన కలిగించాలని కోరారు ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు కే రాజశేఖర్, ఎఫ్.ఆర్టి.ఐ. అభిమానులు కే విజయ్ కుమార్ పాల్గొన్నారు

## ఏపీని వణికిస్తున్న మహమ్మారి..

### నాలుగేళ్లలో 1.6 లక్షల మందికి క్యాన్సర్!

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 04 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్యాన్సర్ మహమ్మారి కోరలు చాచుతోంది. గత నాలుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత భయానకమో అర్థమవుతోంది. 2021 నుండి 2025 మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.6 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు మరియు చిన్న పట్టణాల్లోని ప్రజలు ఈ వ్యాధి బారిన ఎక్కువగా పడుతుండటం గమనార్హం. కేవలం రోగి ఆరోగ్యాన్నే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని సైతం ఈ వ్యాధి ఛిన్నాభిన్నం చేస్తోంది.ఈ మహమ్మారి బారిన పడుతున్న వారిలో అత్యధికులు మహిళలే ఉ ండటం గమనార్హం. మొత్తం నమోదైన కేసుల్లో దాదాపు 65 శాతం మంది మహిళలే ఉండటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల అవగాహన లోపం లేదా సకాలంలో పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గణాంకాలు మహిళా ఆరోగ్యంపై ప్రభుత్వం మరియు సమాజం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

క్యాన్సర్ చికిత్స అనేది అత్యంత ఖరీదైన మరియు సుదీర్ఘమైన ప్రక్రియగా మారింది. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో దాదాపు 12.6 లక్షల చికిత్స ఎపిసోడ్లు నమోదయ్యాయి. వీటి కోసం ప్రభుత్వం మరియు బాధితులు కలిసి సుమారు ?3,061 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా. ఒక సామాన్య కుటుంబానికి ఈ చికిత్స భారం మోయలేనిదిగా మారుతోంది. ఆరోగ్య బీమా పథకాలు ఉన్నప్పటికీ, అనుబంధ ఖర్చులు మరియు చికిత్స తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. రాష్ట్రంలోని ఈ క్లిష్ట పరిస్థితులపై ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు మరియు ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు లోతైన విశ్లేషణ చేశారు. పెరుగుతున్న కేసుల తీవ్రతను, తక్షణమే తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరిస్తూ ఆయన ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించారు. క్యాన్సర్ నివారణకు ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు పెంచాలని, గ్రామీణ స్థాయిలో వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని ఆయన సూచించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి కార్యాచరణను సిద్ధం చేస్తోంది.



## విజయవాడలో 'అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్' ఘన ప్రారంభం









విజయవాడలో 'అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్' ఘన ప్రారంభం.చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా,తెలుగు రాష్ట్రాల్లో చిన్నారుల పునరావాస రంగంలో అగ్రగామిగా ఉన్న 'అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్' (అశోక రిహాబ్ ప్రైవేట్ లిమిటెడ్ (గ్రూప్) తన నూతన శాఖను విజయవాడలో ఘనంగా ప్రారంభించింది.అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ను డాక్టర్ సచిన్ కుమార్ గుల్వే,డాక్టర్ రాహుల్ గుల్వే నవిత రాహుల్ గుల్వే, కిరణ్ కుమార్ గుల్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్స్ నవిత రాహుల్ గుల్వే , రాహుల్ గుల్వే, సచిన్ కుమార్ గుల్వే,విజయవాడ బ్రాంచ్ ఫ్రాంచైజ్ పృద్వి నాయుడు,సురేష్ మాట్లాడుతూ పిల్లలకు అనేక రకాల సమస్యలను నివారించడానికి ఈ సెంటర్ ఎంతగానో ఉపయోగ పడుతుందని,హైదరాబాద్ లో సుమారు 15 బ్రాంచ్ లు ఉన్నాయన్నారు.ఇప్పటి నుంచి హైదరాబాద్ రాకుండా అదే ట్రీట్ మెంట్ విజయవాడలో అందిస్తామన్నారు.అశోక చైల్డ్ లో అనేక థెరపీ లు కలవు ,మీ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుంది,పిల్లలకు ఎటువంటి సమస్య ఉన్నా వాటిని నయం చేయడం జరుగుతుందన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ లో ఇది రెండోవ బ్రాంచ్,

కొన్ని థెరఫీలో 3 రకాల వాటికి మాత్రమే చికిత్స ఉంటుంది, పిల్లలకు ఎలాంటి సమస్య ఉన్నా ఇక్కడ చికిత్స ఉంటుందని,పిల్లల తల్లి తండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని,అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం ఆటిజం, మాటలు రాకపోవడం, శారీరక మరియు మానసిక ఎదుగుదల లోపాలున్న చిన్నారులకు శాస్త్రీయ పద్ధతుల్లో చికిత్స అందించడం, వారిని సమాజంలో స్వతంత్రులుగా తీర్చిదిద్దడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.నిపుణులైన డైరెక్టర్ల పర్యవేక్షణ ఉంటుంది.చిన్నారుల శారీరక, సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచడానికి అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.సమస్యలను ముందస్తుగా గుర్తించి, తల్లిదండ్రులను కూడా చికిత్సలో భాగస్వాములను చేస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.విజయవాడ పరిసర ప్రాంతాల్లోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.ఈ సంస్థతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది .విజయవాడ పరిసర ప్రాంత పిల్లలకు అనేక రకాలుగా సేవలు అందిస్తామన్నారు.

## వైసీపీ కుట్రలు కూటమి సమన్వయంపై చంద్రబాబు పవన్ కల్యాణ్ భేటీ



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 04 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు.ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు.టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది.నిన్న కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

## ప్రాథమిక సహాయక చర్యలపై విద్యార్థులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 04 :** ప్రాథమిక సహాయక చర్యలపై విద్యార్థులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం – రెస్క్యూ మరియు ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్స్ శిక్షణ – ప్రమాద సమయంలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకం – జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి గారు. బుధవారం ఎం.ఆర్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అగ్నిమాపక మరియు విపత్తు నిర్వహణ శాఖ, రెడ్ క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "రెస్క్యూ మరియు ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్స్" ప్రదర్శనను జిల్లా కలెక్టర్ గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో అగ్నిమాపక సిబ్బంది వివిధ రకాల అగ్ని ప్రమాదాలను ఎలా అదుపు చేయాలి, భవనాల్లో చిక్కుకున్న వారిని ఎలా సురక్షితంగా బయటకు తీసుకురావాలి (రెస్క్యూ) అనే అంశాలపై ప్రత్యక్షంగా చేసి చూపారు.మంటలు వ్యాపించినప్పుడు గ్యాస్ సిలిండర్లను ఎలా ఆర్పాలి, ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్లను ఎలా వాడాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ప్రాథమిక సహాయక చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి గారు విద్యార్థులకు సూచించారు.ప్రమాదం జరిగిన మొదటి కొన్ని నిమిషాలు (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో ధైర్యంగా వ్యవహరించాలని తెలిపారు.పాలిటెక్నిక్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని, రెస్క్యూ ఆపరేషన్లలో ఉపయోగించే అత్యాధునిక పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు.



# హిందూ ద్రోహి వైసీపీ.. జనసేన నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 04: హిందూ ద్రోహి వైసీపీ అంటూ జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ నాగబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీపై ఫైర్ అవుతూ.. బుధవారం నాడు నాగబాబు ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో.. 'ఆది శంకరుల అద్వైతం. నేను పరమాత్మను నమ్ముతాను. హిందుత్వం అనేది ఒక ధర్మం. ఇది జియోగ్రాఫికల్ ఐడెంటిటీ. ఈ పుణ్య భూమిలో పుట్టిన ప్రతిఒక్కరూ హిందువే. నా ధర్మాన్ని గౌరవిస్తూ.. ఇతరులను కించపరచకుండా బతుకుతాను. అలానే అర్చకుల జీతభత్యాల గురించి నేను శాసనమండలిలో మాట్లాడాను' అని నాగబాబు తెలిపారు.

ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దారుణ ఘటనలను నాగబాబు ప్రస్తావించారు. '2020 సెప్టెంబర్ 6న అంతర్వేది రథం దగ్ధమైన రోజు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమాలకు తలొగ్గి కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పింది. 2023లో ఆర్టీఐ కింద దరఖాస్తు చేస్తే.. అంతర్వేది కేసును అసలు తాము విచారణ చేయలేదని సీబీఐ వివరించింది. అంటే వైసీపీ నేతలు చేసిన ప్రకటనను అమలు చేయకుండా మోసం చేశారని తేలిపోయింది. మసి పూసి మారేడు కాయ చేయడంలో నిపుణులైన వైసీపీ నేతలు దీనిపై ఎందుకు మాట్లాడరు. అవతలి వారి వ్యక్తిగత జీవితాలపై వారికి ఉన్న ఆసక్తి.. హిందూ ఆలయాలపై ఎందుకు ఉంటుంది. రామతీర్థం రాముడు మనకు దైవం.. డిసెంబర్ 2020లో రాముడు తల నరికినా వైసీపీ ప్రభుత్వంలో చర్యలు లేవు. నామ్ కే వాస్తగా కేసులు పెట్టి.. చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో దోషులను శిక్షించలేదు. మీరు, మీ మంత్రులకు ఇతర వ్యక్తుల సినిమాలపై రివ్యూలు ఇచ్చే శ్రద్ధ రాముడిపై ఎందుకు ఉంటుంది' అని ఆయన అన్నారు.

'అయోధ్యలో రామమందిరం కల సాకారం అయితే.. చంద్రబాబు, పవన్ వెళ్లి పాలు పంచుకున్నారు. నేడు హిందువులపై ఎక్కడ లేని ప్రేమ వలక పోస్తున్న ఆ నాయకుడు అయోధ్యపై ఒక్క పోస్టు అయినా పెట్టారా?. వెళ్లలేక పోయినా కనీసం స్పందిస్తూ.. ప్రకటన అయినా విడుదల చేశారా?. పేదల నుంచి కోటీశ్వరుల వరకు అందరూ తిరుమల వెంకన్నను దర్శనం చేసుకోవాలని చూస్తారు. అటువంటి కొండపై వసతుల ఛార్జీలు ఇష్టం వచ్చినట్లు పెంచేశారు. ఇది సామాన్యులకు భగవంతుడిని దూరం చేయడం కాదా?. మాఫియా కోసం పేద ప్రజలను వెంకన్న స్వామికి అందకుండా చేస్తారా?. కూరగాయలు బేరమాడినట్లు సేవల పెంపులో వైసీపీ నేత సుబ్బారెడ్డి బేరం ఆడిన విధానం అందరూ చూశారు. తిరుమలపై నువ్వు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు.. టీటీడీ కామన్ గుడ్ ఫండ్ ఇచ్చే కంట్రిబ్యూషన్ రూ.2.50 కోట్లు ఉండేది.. రూ.50 కోట్లకు ఒకేసారి పెంచేశావు' అని నాగబాబు విమర్శించారు.

'తిరుపతిలోనే కాదు.. ఎక్కడ కొండ కనిపించినా గుండు కొట్టేయడమే మీకు అలవాటు. డిక్లరేషన్ ను గౌరవించడం మన సంప్రదాయం. అయినా బాధ్యత గురించి వైసీపీ నేతలకు చెప్పడం చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లే. పవన్ కల్యాణ్ తన సతీమణి, పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అలానే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం డిక్లరేషన్ ఇచ్చారు. అబ్దుల్ కలాం కంటే నువ్వు గొప్పోడివా.. నీ మంత్రి వచ్చి తిరుమల నీ అమ్మ మొగుడు కట్టాడా అంటాడా..?. అలా తలపొగరుతో మాట్లాడినందుకే 151 మధ్యలో 5 తీసేసి 11 సీట్లే ఇచ్చారు. అయినా నువ్వేమైనా మారావా.. డిక్లరేషన్ అడిగారని తిరుమల పర్యటన మానుకున్న చరిత్ర నీది. సెక్యులర్, రిలీజియస్ ప్లేస్‌లకు తేడా తెలియని వ్యక్తివి నువ్వు. తిరుమల కల్తీ ఉదంతంలో అబద్ధాలు చెబుతున్నారు' అంటూ వైసీపీపై నాగబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం: బీజేపీ చీఫ్ నితిన్ నబిన్

క్రైం కౌంటర్ న్యూస్, మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 04: తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు నితిన్ నబీన్రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు.

ఏ ఒక్క హామీ అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.



కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌరహక్కులు కాలరాసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీని చూసి భయపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్: టీ బీజేపీ చీఫ్

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పెరుగుతాయని అన్నారు.


వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# అనుమతి లేకున్నా.. గుంటూరుకు జగన్.. భారీగా ట్రాఫిక్ జామ్..



క్రైం కౌంటర్ న్యూస్, గుంటూరు, ఫిబ్రవరి 4: మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి మంది మార్బలంతో గుంటూరుకు బయలుదేరారు మాజీ సీఎం. ఈ క్రమంలో గుంటూరు – విజయవాడ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో కనీసం అంబులెన్స్‌లకు కూడా దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ట్రాఫిక్ ఇబ్బందులపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే గతంలో పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో జగన్ పర్యటనల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలీసు ఆంక్షలు విధించారు. ఎడ్లపాడు జాతీయ రహదారిపై వైసీపీ నేతల వాహనాలను పోలీసులు నిలిపివేస్తున్నారు. గుంటూరులో జగన్ పర్యటనకు వెళ్లకుండా ఆంక్షలు పెట్టి, పలువురు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వైసీపీ కేడర్ తరలివెళ్తోంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దగ్గర తనిఖీలు నిర్వహించి ఎక్కడికక్కడ వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు. మరోవైపు.. జగన్ గుంటూరు పర్యటనకు అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పోలీసు అధికారులను కోరారు. అందుకు పోలీసులు నిరాకరించారు. గుంటూరు జిల్లా పరిధిలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడా బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతి లేదని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రకటన జారీ చేసింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పని గుంటూరు పోలీసులు హెచ్చరించారు.

# ఏపీ ప్రజలకు మరో అదిరిపోయే గుడ్‌న్యూస్.




క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 04 : ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఆన్‌లైన్ సేవలను విస్తరిస్తోంది. పాలనలో సాంకేతికతను అందిపుచ్చుకుని సులువుగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీని ద్వారా ఇన్‌కమ్, రెసిడెన్షియల్, కులం వంటి ప్రభుత్వ ధృవీకరణ సర్టిఫికేట్లతో పాటు ఆర్టీసీ, దేవాలయాల్లో దర్శనం, పర్యాటక ప్రదేశాల్లో ఎంట్రీ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ప్రతీదానికి వివిధ ప్రత్యేక వెబ్‌సైట్లోకి వెళ్లి ప్రభుత్వ సేవలు పొందాల్సిన అవసరం లేకుండా అన్నీ ఆన్‌లైన్ సేవలు ఒకేచోట లభించేలా వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఎలా వాడాలనే దానిపై గ్రామ, వార్డు సచివాలయ అధికారులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. 9552300009 నెంబర్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించుకోవచ్చు. ఆ నెంబర్‌కు హాయ్ అనే మెస్సేజ్ పెట్టడం ద్వారా సర్వీసులను మొదలుపెట్టవచ్చు.కొత్త సేవలు ఏపీ పురపాలక శాఖ 25 సేవలను ఆన్లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్ ద్వారా మ్యారేజ్ సర్టిఫికేట్‌తో పాటు ఆస్తి పన్ను చెల్లింపులు చేయవచ్చు. అలాగే ట్రేడ్ లైసెన్స్, మ్యూటేషన్ వంటి 25 రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్ద నుంచే సులువుగా పొందవచ్చు. అలాగే ఏ సర్టిఫికేట్ ఎప్పటిలోగా జారీ చేయాలనే దానిపై ప్రభుత్వం గడువు విధించింది. మ్యారేజ్ సర్టిఫికేట్‌ను 3 రోజుల్లోగా జారీ చేయాల్సి ఉంటుంది. ఇక ట్రేడ్ లైసెన్స్ 7 రోజులు, ఇంటి పన్నుకు 15 రోజుల గడువు విధించింది. దీని ద్వారా సర్టిఫికేట్ల జారీలో వేగం పెరగనుంది. అంతేకాకుండా ఆ గడువు ముగిసిన తర్వాత సర్టిఫికేట్లు జారీ చేయకపోతే కారణాలను తెలపాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తు రిజెక్ట్ చేసినా రీజన్ చెప్పాల్సి ఉంటుది. అధికారులు గడువులోగా దరఖాస్తులు క్లియర్ చేయకపోతే క్రమిశిక్షణ చర్యలు కూడా తీసుకుంటారు. దరఖాస్తులు,సర్టిఫికేట్ల జారీలో పారదర్శకత, వేగం పెంచేందుకు ఈ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెసుకొచ్చింది. దీంతో మున్సిపల్ సేవలన్నీ ఆన్‌లైన్‌లోకి అందుబాటులోకి రావడంతో ప్రజలు కూడా వేగంగా సర్టిఫికేట్లు పొందుతారు. త్వరలో మరిన్ని సేవలను ప్రవేశపెట్టనున్నారని తెలుస్తోంది.

# నిందితులకు చీరాల పోలీసులు స్పెషల్ ట్రీట్‌మెంట్




క్రైం కౌంటర్ న్యూస్, బాపట్ల, ఫిబ్రవరి 04: యువతలో నేర ప్రవృత్తి బాగా పెరుగుతోంది. దీనిని కట్టడి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. నేరానికి పాల్పడిన నిందితులను కిలోమీటర్ల మేర పట్టపగలు నడి రోడ్డుపై నడిపించి.. పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్తున్నారు. ఈ తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చీరాలలో యువకుడి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు పాల్పడిన నిందితులకు పోలీసులు ఈ తరహా పద్ధతినే అమలు చేశారు. నేరాలకు పాల్పడే వారికి ఈ తరహా చర్యలు తప్పవంటూ నేర ప్రవృత్తి ఉన్నవారికి చెప్పకనే చెప్పారు పోలీసులు.ఇంతకీ ఏం జరిగిందంటే..జనవరి 27న చీరాల ఫ్లైఓవర్ వద్ద కొండే త్రినాథ్ (19) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని బీరు బాటిల్స్‌తో దారుణంగా పొడిచి.. బండరాయితో తలపై మోది హత్య చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంతాల్లోని పలు సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

తమదైన శైలిలో వారిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఓ యవతితో ప్రేమ వ్యవహారంలో త్రినాథ్‌ను షేక్ గౌస్ హత్య చేశాడు. అతడికి దేవ హర్ష, శీలం భగవంతుడు సహాయం చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది.

బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన కొండె వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులకు రెండో కుమారుడు త్రినాథ్ (19). అతడు తన అన్నతో కలిసి చీరాలలోని నానామ్మ ఇంటి వద్ద ఉంటూ.. రోజు వారీ విద్యుత్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. త్రినాథ్, ఓ యువతి ప్రేమించుకుంటున్నారు. ఆ యువతిని త్రినాథ్ స్నేహితుడు షేక్ గౌస్ సైతం ప్రేమిస్తున్నాడు. దాంతో త్రినాథ్‌పై షేక్ గౌస్ కక్ష పెంచుకున్నాడు. దాంతో స్నేహితుల సహాయంతో త్రినాథ్‌ను గౌస్ దారుణంగా హత్య చేశాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

## మోదీ మలేసియా పర్యటన ఖరారు



క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండ్రోజుల అధికారిక పర్యటనకు మలేసియా వెళ్తున్నారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 7,8 తేదీలో మలేసియాలో పర్యటించనున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ (వీజూా) బుధవారంనాడు తెలిపింది. మలేసియాలో మోదీ పర్యటించనుండటం ఇది మూడోసారి. అయితే 2024 ఆగస్టులో ఇరుదేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలను కుదుర్చుకున్న తరువాత మలేసియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతే ప్రధాన లక్ష్యంగా మోదీ పర్యటన ఉంటుందని ఎంఈఏ తెలిపింది.ప్రధాని తన పర్యటనలో భాగంగా మలేసియా ప్రధానితో సమావేశమై ఇరుదేశాల మధ్య సహకారంతో పాటు పలు అంశాలపై చర్చిస్తారు. మలేసియాలోని ప్రవాస భారతీయులను కలుసుకుంటారు. పారిశ్రామిక వేత్తలు, వాణిజ్య ప్రతినిధులతో సమావేశమవుతారు. ఇండియా-మలేసియా సీఈఓ ఫోరం సమావేశంలోనూ మోదీ పాల్గొంటారు.

కాగా, చరిత్ర, నాగరికత, సాంస్కృతిక సంబంధాల పరంగా భారత్-మలేసియా మధ్య సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. మలేసియాలో 29 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. ప్రపంచంలో ప్రవాస భారతీయులు అత్యధికంగా నివసిస్తున్న దేశాల్లో మలేసియా మూడవది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, తీరప్రాంత సహకారం, డిజిటల్- ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఇంధనం, హెల్త్‌కేర్, విద్యం, సంస్కృతి, పర్యాటక, ప్రజా సంబంధాల పరంగా భారత్-మలేసియా మధ్య విస్తృత సహకారం ఉందని, ఈ రంగాల్లో ప్రగతిని ఇరుదేశాల ప్రధానులు సమీక్షించనున్నారని ఎంఈఏ తెలిపింది.

## 'గీతంకు భూముల'పై హైకోర్టు విచారణ

### పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం




క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 4 విశాఖపట్నం, రుషికొండ పరిధిలో 54.79 ఎకరాలను గీతం యూనివర్సిటీ పేరు మీద క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ అధికారులు చేసిన ప్రతిపాదనను అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, విశాఖ గ్రామీణ తహసీల్దార్, గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి శ్రీభరత్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. విశాఖకు చెందిన న్యాయవాది నిమ్మి గ్రేస్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. 'భూములు చాలాకాలం నుండి యూనివర్సిటీ అధీనంలో ఉన్నాయి. వాటిని వర్సిటీ పేరుమీద క్రమబద్దీకరించేందుకు తహసీల్దార్ ప్రతిపాదనలు చేశారు. క్రమబద్ధీకరణకు వర్సిటీ యాజమాన్యం దరఖాస్తు చేయలేదు. ప్రతిపాదించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో రాస్తా, కొండ, కాలువగా నిర్వచించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 30 ప్రకారం ఆ భూములను క్రమబద్దీకరించడానికి వీల్లేదు' అని వాదించారు. రెవెన్యూ తరఫున ప్రభుత్వ న్యాయవాది కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... 'పిటిషన్‌కు విచారణార్హత లేదు. ప్రస్తుత వ్యవహారంతో పిటిషనర్‌కు సంబంధం లేదు. న్యాయ విచారణ ప్రక్రియను పిటిషనర్ దుర్వినియోగం చేస్తున్నారు. పిటిషనర్ చేస్తున్న ఆరోపణలకు, కోర్టు ముందు ఉంచిన ప్రభుత్వ జీవోకు సంబంధం లేదు. కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు.భూకేటాయింపునకు, భూక్రమబద్ధీకరణకు మధ్య వ్యత్యాసం ఉంది. విశాఖలో ఏ సంస్థకు భూములు కేటాయించినా ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ కోర్టులో వ్యాజ్యాలు వేస్తున్నారు. ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం కోసమే ఇలాంటి వ్యాజ్యాలు వేస్తున్నారు' అని వివరించారు. గీతం వర్సిటీ ప్రెసిడెంట్ ఎం.శ్రీభరత్ తరఫున న్యాయవాది రుద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ... 'భూముల కేటాయింపునకు సంబంధించి నివర్సిటీ అభ్యర్ధనను పరిగణనలోకి తీసుకోవాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులకు అనుగుణంగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తాం' అని పేర్కొన్నారు.

## 2026-27 ఏపీ బడ్జెట్.. పయ్యావుల కీలక చర్చలు.. వాటిపైనే స్పెషల్ ఫోకస్

క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ




శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

రోడ్ల అభివృద్ధిపైనా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

## తిరుమలతో రాజకీయం చేస్తే వినాశనం తప్పదు.. వైసీపీకి భానుప్రకాష్ వార్నింగ్



క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: వైసీపీ నాయకులపై టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవం కలియుగ వేంకటేశ్వర స్వామి, హిందువుల ఆధ్యాత్మిక రాజధాని తిరుమల క్షేత్రాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని సూచించారు. తిరుమల చుట్టూ రాజకీయాలు తిరిగితే వినాశనమే జరుగుతుందన్నారు. వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ గిరిప్రదక్షిణ చేసి పుణ్యం సంపాదించుకోవాలని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రజలు ఇప్పటికే వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని, అయినా సిగ్గు లేకుండా స్వామివారితో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంలో ఉన్నామా...

వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో నెయ్యి కాకుండా కల్తీ పదార్థాలు వాడారని సిట్ నివేదికలో స్పష్టంగా ఉందని భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కొందరు వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాక్షస పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలకు జైత్రయాత్ర అనేది లేదని, ఎన్నడూ లేని విధంగా దీపావళికి జగన్ మోహన్ రెడ్డి టపాసులు కాల్చారని విమర్శించారు. టపాసులు కాల్చుకోవడానికి వైసీపీ నేతల శేష జీవితం సరిపోతుందని ఆయన సెటైర్ వేశారు.

తిరుమలే టార్గెట్‌గా..

2019-2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల పాలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతుంటే జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని అన్నారు. టార్గెట్ తిరుమలగా వైసీపీ నేతలు పని చేస్తున్నట్లు విమర్శించారు. వైసీపీ దుర్మార్గులు ఇప్పుడు ఏపీ మీద పడ్డారన్నారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని.. వైసీపీ నేతలు ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో దృతరాష్ట్రుడి పాలన జరిగిందంటూ ఆయన వ్యాఖ్యానించారు.

అందరూ బయటకొస్తారు..

సిట్ నివేదికలో కోట్ల రూపాయలు హవాలా మార్గంలో చేతులు మారాయని తేలిందని భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. కల్తీ నెయ్యి వెనుక ఉన్న కుట్రదారులు, పాత్రధారులు బయటకు వస్తారని తెలిపారు. కుల రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌ను వేదికగా చేసుకోవద్దని సూచించారు. ఆంబోతులను రోడ్లపైకి వచ్చి.. ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఈరోజు ఇంకో నాయకుడు (జగన్) గుంటూరుకు బయలుదేరారని చెప్పారు. రోడ్డుపై ఆంబోతులు గొడవ చేస్తే వదిలేస్తామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆందోళనలు.. జగన్ ప్రీ ప్లాన్ స్కెచ్‌గా భావిస్తున్నామని తెలిపారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే గందరగోళం చేస్తున్నారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు.

మనిషిలా ప్రవర్తించాలి...

2019 నుంచి 2024 వరకు తిరుమలలో చేసిన అపచారాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి ఢిల్లీకి వచ్చి కల్తీ నెయ్యిపై నీతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు అనుకుంటున్నారని.. భోగి పండుగకు డ్యాన్సులు, దీపావళికి టపాసులు తప్ప జైత్రయాత్ర చేసేది లేదని వ్యంగ్యంగా విమర్శించారు. మనిషిలాగా ప్రవర్తించాలి కాని ఆంబోతులాగా కాదని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి సూచించారు.

## మీరు దుశ్శాసనులేమో... ఇక్కడ ద్రౌపదులెవరూ లేరు

**జుట్టుపట్టుకొని లాగడానికి అధికారంలోకి వచ్చేవరకూ ఎందుకు?**

**11 మందితో సభకు రండి తేల్చుకుందాం**

**నేను రెచ్చగొట్టాననడానికి ఆధారాలేవి?**

**మేం పట్టుకొచ్చింది చీపుళ్లు.. రాడ్లు కాదు**

**మహిళలపై ముందు దాడి చేసింది వైసీపీవాళ్లే: ఎమ్మెల్యే గల్లా మాధవి**

క్రైం కౌంటర్ న్యూస్, గుంటూరు, ఫిబ్రవరి 3 'జుట్టు పట్టుకుని ఈడ్చుడానికి మీరు దుశ్శాసనులు కావచ్చేమో... ఇక్కడ ద్రౌపదులెవరూ లేరు' అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు వ్యాఖ్యల నేపథ్యంలో వైసీపీ శ్రేణుల హెచ్చరికలకు మంగళవారం ఆమె ప్రతిస్పందించారు. పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబును అంబటి దుర్భాషలాడడం వెనుక వైసీపీ కుట్ర ఉంది. పథకం ప్రకారం శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, రివర్స్ డ్రామాలకు పాల్పడుతోంది. తిరుపతి లడ్డు కల్తీ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వారం రోజుల్లో అన్ని విషయాలు స్పష్టంగా బయటకు వస్తాయి. సీఎం చంద్రబాబును దూషించి, ఆ తరువాత నేను అనలేదు అంటూ అంబటి మాట మార్చడం సిగ్గుచేటు. కార్యకర్తలను నేను రెచ్చగొట్టానని చెప్పడానికి ఆధారాలు ఎక్కడ ఉన్నాయి? నేను దాడి చేయాలనుకుంటే మీరు టీడీపీ కార్యాలయంపై చేసినట్టు చేయించలేనా? కేంద్ర మంత్రి పెమ్మసాని భార్యను రాజకీయాల్లోకి లాగడం ఎందుకు? ఈ ఘటనకు ఆమెకు ఏం సంబంధం? ఆమె ఎందుకు సమాధానం చెప్పాలి?' అని ఎమ్మెల్యే నిలదీశారు. అంబటి కుమార్తెను ఉద్దేశించి మాట్లాడుతూ... 'మహిళలపై దాడి గురించి మాట్లాడుతున్న మీరు... టీడీపీ మహిళా కార్యకర్తపై మీ నాన్న కార్యాలయం వద్ద దాడి జరిగినప్పుడు మీ తండ్రిని ఎందుకు ప్రశ్నించలేదు? మీ నాన్న పవన్ కల్యాణ్ గురించి అవమానకరంగా మాట్లాడినప్పుడు కులం గుర్తుకు రాలేదా? ఇప్పుడు మాత్రం కులాన్ని ఎందుకు వాడుకుంటున్నారు? మేము మాట్లాడితే రెచ్చగొట్టినట్టా? మీరు మాట్లాడితే ప్రశ్నించడమా?' అంటూ ఆగ్రహంగా నిలదీశారు.

జక్కంపూడి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ...




'అధికారంలోకి వచ్చాక జుట్టు పట్టుకుని బయటకు లాగుతాం... అంటూ జక్కంపూడి రాజా మాట్లాడుతున్నారు. ఇది వారి రాజకీయ వైఖరికి నిదర్శనం. అప్పటిదాకా ఎందుకు? ఇప్పుడే అసెంబ్లీకి వచ్చి తేల్చుకోండి. వైసీపీ ఎమ్మెల్యేలకు దమ్ముంటే ఈ నెల 11న 11 మందీ కలిసి అసెంబ్లీకి రావాలి. అక్కడే అన్ని అంశాలు తేల్చుకుందాం. 2029 వరకు వేచిచూడడం ఎందుకు?' అని గల్లా సవాల్ విసిరారు.

వైసీపీది రివర్స్ డ్రామా రాజకీయాలు

'గత రెండు రోజుల పరిణామాలన్నీ వైసీపీ ఆడుతున్న రివర్స్ డ్రామా రాజకీయాలే. ఒకవైపు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, మరోవైపు బాధితులమని నటించడం వైసీపీకి అలవాటే. మీరు 11 సీట్లకే ఎందుకు పరిమితమయ్యారో ప్రజలకు తెలుసు. మేము చీపుర్లు తీసుకుని వచ్చాం... రాడ్లు కాదు. మా ఇంటి ఆడవాళ్లను తిడితే కోపం రాదా? మా మహిళా కార్యకర్తలపై దాడి మొదలుపెట్టింది వైసీపీనే. మేం చేసింది కేవలం నిరసన మాత్రమే' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మమ్మల్ని అంటే భరించాం.. సీఎంని అంటే ఊరుకోం 'మమ్మల్ని డమ్మీలు అన్నా స్పందించలేదు. మాపై ఎన్ని విమర్శలు చేసినా భరించాం. కానీ ముఖ్యమంత్రి స్థాయిని తాకితే మాత్రం చూస్తూ ఊరుకోం. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైనవాళ్లతో వైసీపీ సోషల్ మీడియా నడుస్తోంది. కొందరు నేతలు నన్ను జుట్టు పట్టుకుని తీసుకొస్తామని మాట్లాడుతున్నారు. ఇలాంటి వ్యాఖ్యలను అంబటి కుమార్తె సమర్థిస్తారా? ముందు సానుభూతిని, తర్వాత కులాన్ని, ఆ తర్వాత మతాన్ని ఆయుధాలుగా వాడడం జగన్ రాజకీయ నైజం' అని మాధవి విమర్శించారు.

## సినిమా



## షాకింగ్ విషయం చెప్పిన రవిబాబు

తెలుగు సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు రవిబాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో రవిబాబు తన కెరీర్‌లోని కొన్ని ఆసక్తికర విషయాలను, చేదు అనుభవాలను పంచుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో స్థానిక నటుల కంటే ఇతర భాషల నటులకు ప్రాధాన్యత ఇవ్వడంపై రవిబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మన నటులు అందుబాటులో ఉన్నా, బయటి నుండి నటులను తీసుకొచ్చి, వారికి తెలుగు డైలాగులు రాక కష్టపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు రవిబాబు. నితిన్ హీరోగా నటించిన విక్టరీ చిత్రంలో తనకు లాయర్ పాత్ర కోసం సురేష్ రెడ్డి అనే వ్యక్తి అడిగారని అప్పుడు జరిగిన ఓ సంఘటనను పంచుకున్నారు రవిబాబు.

నితిన్ హీరోగా, ఆర్ ఆర్ మూవీ మేకర్స్ నిర్మించిన విక్టరీ చిత్రంలో అశుతోష్ రాణా అనే హిందీ నటుడికి ఎక్కువ రెమ్యునరేషన్ ఇస్తున్నారని తెలుసుకుని, రవిబాబు గట్టిగా ప్రశ్నించారట. నాకు తెలుగు వచ్చు, అశుతోష్ రాణాకి తెలుగు రాదు. నా ఇంట్లో నేను ఉంటాను, బిజినెస్ క్లాసులో ఢిల్లీ నుంచో, బాంబే నుంచో రాను. నాకు మేకప్ మేన్, అసిస్టెంట్ లేరు, నా కారు నేను వేసుకొని వస్తాను. ఆంధ్రప్రదేశ్‌లో అతని కంటే 100 రెట్లు ఇమేజ్ నాదే ఎక్కువ అలాంటప్పుడు.. అయినప్పటికీ, తనకంటే అతనికి ఎక్కువ డబ్బులు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారట. తన వాదనకు ఆ నిర్మాత దగ్గర సమాధానం లేదని, అతని కంటే చివరకు లక్ష రూపాయలు ఎక్కువ ఇస్తేనే చేస్తానని చెప్పి, ఆ సినిమా చేశానని రవిబాబు గుర్తు చేసుకున్నారు.

ఇక్కడ చాలా మంది టాలెంటెడ్ నటులు ఉన్నప్పుడు, ఇతర భాషల నుండి తక్కువ అర్హత కలిగిన నటులను ఎందుకు తీసుకువస్తున్నారని అన్నారు రవిబాబు. దీనికి ఉదాహరణగా, లెజెండ్ సినిమాలో అద్భుతమైన విలన్ పాత్ర పోషించిన జగపతి బాబును ప్రస్తావించారు. జగపతి బాబు మంచి ఆర్టిస్ట్ అని రవిబాబు అన్నారు. జగపతి బాబు వంటి తెలుగు నటులు అందుబాటులో ఉన్నా, మలయాళం, తమిళం నుండి విలన్లను ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. రవిబాబు తన లైఫ్ స్టైల్ గురించి మాట్లాడుతూ.. తాను ఇండస్ట్రీలో పెద్దగా ఎవరితోనూ మాట్లాడానని, పబ్లిక్ ప్లేస్‌లకు, ఫంక్షన్లకు వెళ్ళనని చెప్పారు. ఇద్దరు ముగ్గురితో మాత్రమే తన ఇంటరాక్షన్ పరిమితమని తెలిపారు. పెద్ద కమర్షియల్ దర్శకులు తనకు వేషాలు ఇవ్వరని, వారి ఫోన్లు ఎప్పుడూ రాలేదని ఆయన అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?

ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. స్వీట్ కార్న్‌లోని పోషక విలువలు, అది డయాబెటిస్‌పై చూపే ప్రభావాల గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

డయాబెటిస్‌పై స్వీట్ కార్న్ ప్రభావం

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్ +× స్కోరు 52-55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.

డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.

అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.

ముఖ్యమైన పోషకాలు: విటమిన్  లతో పాటు మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీకి తోడ్పడతాయి.

ప్రతికూల అంశాలు

అధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం.

ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది.

షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ ఎలా తినాలి?

మోతాదు ముఖ్యం: రోజువారీ ఆహారంలో ఒక చిన్న కప్పు తీసుకోవడం సురక్షితం.

ఉడికించడం ఉత్తమం: నూనెలో వేయించడం కంటే ఉడికించిన లేదా కాల్చిన మొక్కజొన్న ఆరోగ్యకరం.

కాంబినేషన్: స్వీట్ కార్న్ తినేటప్పుడు దాంతో పాటు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారంలేదా పీచు పదార్థం ఉన్న కూరగాయలు తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది.



## గుండె జబ్బులు ఉన్నవారు బొప్పాయి తినవచ్చా?

తీపి రుచి, విటమిన్లు ఎ, సి, ఇ యాంటీఆక్సిడెంట్లతో నిండిన బొప్పాయిని సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో దీనికి సాటిలేదు. అయితే, ఈ పండు అందరికీ ఆరోగ్యప్రదాయిని కాదని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా గుండె జబ్బులు, థైరాయిడ్ కిడ్నీ సమస్యలు ఉన్నవారు బొప్పాయిని తీసుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.బొప్పాయిని నివారించాల్సిన వారు -- కారణాలు:

గుండె సమస్యలు ఉన్నవారు: బొప్పాయి గుండె దడను తగ్గించే అవకాశం ఉంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఇది ప్రమాదకరంగా మారవచ్చు. ముఖ్యంగా రక్తాన్ని పలుచబరిచే మందులు వాడేవారు దీనికి దూరంగా ఉండాలి. బొప్పాయిలోని పపైన్ ఈ మందుల ప్రభావాన్ని పెంచి రక్తస్రావం అయ్యేలా చేస్తుంది.

గర్భిణీ స్త్రీలు: పండని లేదా సగం పండిన బొప్పాయిలో లేటెక్స్, పపైన్ అధికంగా ఉంటాయి. ఇవి గర్భాశయ సంకోచాలకు కారణమై అకాల ప్రసవం లేదా ఇతర గర్భధారణ సమస్యలకు దారితీస్తాయి.

థైరాయిడ్ రోగులు: బొప్పాయిని ఎక్కువగా తీసుకోవడం వల్ల థైరాయిడ్ హార్మోన్ స్రావంలో మార్పులు వస్తాయి. మీరు వాడే మందుల శోషణను ఇందులోని ఫైబర్ అడ్డుకుంటుంది, దీనివల్ల అలసట మెటబాలిజం దెబ్బతినే అవకాశం ఉంది.

కిడ్నీలో రాళ్లు ఉన్నవారు: బొప్పాయిలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. అయితే, విటమిన్-సి అతిగా శరీరంలోకి చేరితే అది కాల్షియం ఆక్సలేట్ కిడ్నీ రాళ్లకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లేటెక్స్ అలెర్జీ: రబ్బరు గ్లౌజులు లేదా బెలూన్ల వల్ల అలెర్జీ కలిగే వారు బొప్పాయిని తినకూడదు. దీనిలోని లేటెక్స్ ద్రవం చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలిగించవచ్చు.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. మీకు ఏవైనా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉంటే బొప్పాయిని ఆహారంలో చేర్చుకునే ముందు ఖచ్చితంగా మీ వైద్యుడిని సంప్రదించండి.

## భారత కుర్రాళ్ల విశ్వరూపం..

హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన అండర్-19 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్‌లో భారత్ సంచలన విజయం సాధించింది. అఫ్గానిస్థాన్ నిర్మించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కుర్రాళ్లు ఊపిరి బిగబట్టే ఉత్కంఠ లేకుండా ఛేదించేశారు. ఈ గెలుపుతో భారత్ రికార్డు స్థాయిలో 10వ సారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. అఫ్గాన్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి చరిత్రలోనే భారత్‌పై అత్యధిక స్కోరు సాధించినా, మన బ్యాటర్ల ముందు అది తలవంచక తప్పలేదు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై ఏ జట్టు కూడా ఇంత భారీ స్కోరు చేయలేదు. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలతో కదం తొక్కారు. ఫైసల్ షినోజాదా 93 బంతుల్లో 110 పరుగులు చేయగా, ఉజైరుల్లా నియాజై 86 బంతుల్లో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో దీపేష్ దేవేంద్రన్, కనిష్క చౌహాన్ చెరో రెండు వికెట్లు తీసినా పరుగులు ధారాళంగా సమర్పించుకున్నారు.

311 పరుగుల లక్ష్యం అంటే సామాన్యమైన విషయం కాదు. కానీ భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఈ లక్ష్యాన్ని చాలా చిన్నదిగా చేసేశాడు. కేవలం 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్, మొత్తం 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 68 పరుగులు చేసి అఫ్గాన్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. మొదటి 10 ఓవర్లలోనే భారత్ 91 పరుగులు చేసి అఫ్గానిస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఆరంభంలో వైభవ్ చూపిన వేగం, భారత్‌కు రన్ రేట్ భయం లేకుండా చేసింది.

వైభవ్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుతంగా ఆడాడు. ఆరోన్ జార్జ్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగులు జోడించాడు. ఆయుష్ 59 బంతుల్లో 62 పరుగులు చేసి వెనుదిరగ్గా, ఆరోన్ జార్జ్ మరోవైపు అఫ్గాన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. క్లాసిక్ షాట్లతో అలరించిన జార్జ్, 104 బంతుల్లో 115 పరుగులు చేసి భారత్ విజయాన్ని ఖాయం చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశాడు. భారత్ 41.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

ఈ మ్యాచ్ పలు రికార్డులకు వేదికైంది:

హైయెస్ట్ రన్ చేజ్: అండర్-19 వరల్డ్ కప్ నాకౌట్ దశలో ఇదే అతిపెద్ద రన్ చేజ్.

భారత్ ఫైనల్ రికార్డు: ఇప్పటివరకు 10 సార్లు ఫైనల్ చేరిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది.

డబుల్ సెంచరీలు: ఒకే ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు ఇద్దరు సెంచరీలు చేసినా భారత్ గెలవడం ఇదే ప్రథమం.

వైభవ్ వేగం: ఈ టోర్నీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీల్లో ఒకటిగా వైభవ్ ఇన్నింగ్స్ నిలిచింది.

ఫైనల్‌లో ఎవరితో?

సెమీఫైనల్‌లో అఫ్గాన్‌పై ఈ భారీ విజయం ఇచ్చిన ఊపుతో భారత్ ఫైనల్‌కు సిద్ధమవుతోంది. ఎల్లుండి జరగనున్న ఫైనల్‌లో భారత్ తన ప్రత్యర్థి ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఇప్పటివరకు ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు ఆరోసారి కప్పు నెగ్గడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విజయంతో భారత యువ ఆటగాళ్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.




## సూర్య మాస్టర్ ప్లాన్..

టీ20 వరల్డ్ కప్‌కు ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లోనే టీమిండియా మేనేజ్మెంట్ భారీ సర్ ప్రైజ్ ఇచ్చింది. నవీ ముంబై వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే అందరూ ఊహించినట్లుగా కాకుండా ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో పాటు ఇషాన్ కిషన్‌ను పంపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మొన్నటి వరకు ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా ఉన్న సంజూ శాంసన్‌ను కాదని.. ఇషాన్ కిషన్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం చూస్తుంటే, వరల్డ్ కప్ ప్రధాన మ్యాచ్‌ల్లో కూడా ఇదే ఫార్ములా కొనసాగుతుందని అర్థమవుతోంది.

ఇషాన్ కిషన్ అదరగొట్టినందుకే ఈ గిఫ్ట్

ఇషాన్ కిషన్‌కు ఈ అవకాశం ఊరికే రాలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఇషాన్ శివతాండవం చేశాడు. ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో ఏకంగా 215 పరుగులు రాబట్టి ఫామ్ అంటే తనదే అని నిరూపించుకున్నాడు. ఆ సిరీస్ చివరి మ్యాచ్‌లోనే సంజూ నుంచి కీపింగ్ గ్లౌజులు అందుకున్న ఇషాన్, ఇప్పుడు ఓపెనింగ్ స్లాట్‌ను కూడా దక్కించుకున్నాడు. గతేడాది పర్ఫార్మెన్స్ ఆధారంగా చూస్తే, సంజూ కంటే ఇషాన్‌కే మేనేజ్మెంట్ ఓటు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

సంజూ శాంసన్ పని అయిపోయినట్లేనా?

వరుసగా వస్తున్న అవకాశాలను చేజార్చుకోవడం సంజూ శాంసన్‌కు శాపంగా మారింది. న్యూజిలాండ్ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లోనూ సంజూ విఫలం కావడంతో సెలెక్టర్ల ఓపిక నశించినట్లుంది. ఇప్పుడు ఇషాన్ ఓపెనర్‌గా వస్తుండటంతో, మూడో స్థానంలో తిలక్ వర్మ వచ్చే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొని వస్తున్న తిలక్ వర్మకు కూడా ఇది పెద్ద పరీక్షే. ఒకవేళ ఇషాన్, అభిషేక్ జోడీ గనుక వార్మప్ మ్యాచ్‌లో క్లిక్ అయితే, వరల్డ్ కప్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌ల్లో సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com